

భోలక్‌పూర్‌లో షాపులను సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

కోర్టు ఆదేశాలు.. ప్లాస్టిక్ స్ర్కాప్ షాపుల సీజ్

ముషీరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ అంజయ్య నగర్ సాయిబాబా దేవాలయం వీధిలో జనావాసాల మధ్య కొనసాగుతున్న ప్లాస్టిక్ స్ర్కాప్ షాపులను కోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు గురువారం సీజ్ చేశారు. డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రామానుజరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తదితరులు పోలీసు బందోబస్తు మధ్య షాపులను సీజ్ చేశారు. ప్లాస్టిక్ షాపుల వల్ల గతంలో పలు మార్లు అగ్ని ప్రమాదాలు జరగడంతో స్థానికులు కోర్టుకు వెళ్లారు. షాపులను సీజ్ చేయడానికి వెళ్లిన అధికారులతో షాపుల యజమానులు వాగ్వాదానికి దిగారు. కోర్టు ఆదేశాల మేరకు షాపులను మూసివేస్తున్నామన్నారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

ముషీరాబాద్ డివిజన్ అభివృద్ధికి కృషి

ముషీరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ కోరారు. ముషీరాబాద్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆమెను బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. డివిజన్‌లో జటిలమైన సమస్యలను పరిష్కరించామన్నారు. పార్కుల అభివృద్ధి, మోడల్ రోడ్‌లు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచిముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, నియోజకవర్గం బీజేవైఎం అధ్యక్షుడు గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



రాధారాణికి రికార్డులు అందజేస్తున్న అతిథులు

12 గంటల గానం.. రికార్డుల్లో చోటు

చిక్కడపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బహుగళ భాషా గాయని భువన రాధారాణికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వెబ్ వరల్డ్ బుక్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో టాలెంటెడ్ మ్యూజికల్ ఆర్ట్స్ ఫౌండేషన్ అధినేత నాగశివరామ్ నిర్వహించిన కార్యక్రమంలో 12 గంటల పాటు వివిధ భాషల్లో గానకోకిల ఎస్. జానకి పాడిన సినీ గీతాలను భువన రాధారాణి శివరామ్, ఆలూరు విల్సన్, అమృతవల్లి, టీఎస్ రావు, అశోక్‌కుమార్, వెంకటాచలం తదితరులతో కలిసి ఆలపించి శ్రోతలను రంజింపచేశారు. ప్రముఖ వైద్యుడు డా. సాయికుమార్, తెలుగు రికార్డ్స్ అధినేత వెంకటేశ్వరరావు, సామాజికవేత్త అంజనీకుమారి, ఆలిండియా రేడియో ఆర్టిస్ట్ అర్పిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధారాణికి రికార్డులు అందజేశారు.



సివిల్స్ అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అమన్ తివారి

అంకితభావం, కఠోరశ్రమతో సివిల్స్‌కు సిద్ధం కావాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంకితభావం, కఠోరశ్రమతో సివిల్స్ సాధించేందుకు అభ్యర్థులు సిద్ధం కావాలని ఆలిండియా సివిల్స్ 74 ర్యాంకర్ అమన్ తివారి సూచించారు. గురువారం సాయంత్రం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో సివిల్స్ అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ముందుగా టెస్ట్ డిమాండ్ ఏమిటో తెలుసుకుని స్కిల్స్‌ను అందుకు అనుగుణంగా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

నేడు 'చలో సెక్రటేరియట్'

కవాడిగూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీవో 317తో స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని జేఏసీ చైర్మన్ టి. విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జిగా బిజ్జి శత్రు



ముషీరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకుడు, ఆల్ ఇండియా ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. గురువారం ముషీరాబాద్‌లో పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శత్రు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

మే 4న మున్నూరుకాపు మహాసభ ఎన్నికలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఎన్నికలు మే 4న నిర్వహిస్తున్నామని ఎన్నికల అధికారి చేపూరి వెంకటేశ్వరరావు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 27న ప్రారంభమవుతుందన్నారు. అధ్యక్షుడు, 29 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నికల్లో ఎన్నుకుంటారని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ నెల 28న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ, 30న పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తామని వివరించారు. మే 4వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా

పలు ప్రాంతాల్లో కొవ్వొత్తుల ప్రదర్శన

కవాడిగూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నామని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలు ఉగ్రవాదంపై పోరాటం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం ఇందిరాపార్కు చౌరస్తాలో బీజేపీ కవాడిగూడ డివిజన్ కమిటీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్‌రాం, బీజేపీ నాయకులు జి. వెంకటేష్, పరిమల్‌కుమార్, ఎంసీ మహేందర్‌బాబు, డివిజన్ ప్రధానకార్యదర్శులు ఎ ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ నేతలు

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నామని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం కవాడిగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ దాడిని ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళా కాంగ్రెస్ ఖండన

చిక్కడపల్లి: పహల్గాం ఉగ్రదాడిని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పాక జ్ఞానేశ్వరిరవిప్రసాద్ తీవ్రంగా ఖండించారు. గురువారం మధ్యాహ్నం జవహర్‌నగర్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

పర్యాటకులపై దాడి గర్హనీయం



నరేష్‌గౌడ్

అంబర్‌పేట: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై దాడి గర్హనీయమని బీజేపీ అంబర్‌పేట డివిజన్ అధయక్షుడు నరేష్ గౌడ్ అన్నారు. విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరపడం బాధాకరమన్నారు. ఉగ్రవాదుల దాడిని అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

పటేల్‌నగర్‌లో..



పటేల్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని బీజేపీ నేతలు ఖండించారు. గురువారం అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాంనగర్‌లో..



రాంనగర్: ఉగ్రదాడికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రామ్, కార్పొరేటర్లు సుప్రియ నవీన్‌గౌడ్, రవిచారి, పార్టీ నాయకులు సాయికృష్ణయాదవ్, గడ్డం సతీష్, ఇల్లందుల రాకేష్, ఖేకల సత్యనారాయణ, నేరెళ్ల రాకేష్, వివేకానంద, గడ్డం నవీన్ పాల్గొన్నారు.



గంగపుత్ర కాలనీలో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఓం గంగాభవానీ సోషల్ సర్వీస్ అధ్యక్షుడు గోవింద్, నాయుకులు రవి, చందు, పూసగోరక్‌నాథ్

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: గంగపుత్ర కాలనీలో ఓం గంగాభవానీ సోషల్ సర్వీస్ అధ్యక్షుడు జి. గోవింద్ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సంస్థ నాయకులు అశోక్‌కుమార్ బి. రవి, చందు, కృష్ణ, చారి, పూస గోరక్‌నాథ్, శ్రీధర్, శ్రీనివాస్, టీఆర్ గోవింద్ సాయి పాల్గొన్నారు.

హేయమైన చర్య



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్: జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ముషీరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డి. శివముదిరాజ్, అరుణ్, పరకాల మనోజ్‌కుమార్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, బల్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బర్కత్‌పుర: జమ్మూకశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు నివాళులర్పిస్తూ గురువారం రాత్రి బర్కత్‌పుర చమన్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్, సి వినోద్‌యాదవ్, క్షీర సాగర్, బల్వీర్, చిట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోల్నాకలో.



గోల్నాకలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

గోల్నాక: పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బీజేపీ గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం గంగానగర్‌లో డీ-మార్ట్ నుంచి ఛేనంబర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ నేతలు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, కె.రవీందర్, సింగీతం రాజేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసమూర్తి తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి అన్నారు. దేశ భవితకు, సామాజిక అవసరాలకు ఈ ఆవిష్కరణలు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. గురువారం బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్ రెడ్డి కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్టార్టప్‌లు - నావిగేటింగ్ ఛాలెంజెస్ అండ్ అచీవింగ్ సక్సెస్ అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతాదేవి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు సవాళ్లను అధిగమించి ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంబీఏ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ రేణుక సాగర్, ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ప్రజా ప్రతినిధులను పట్టించుకోని ప్రభుత్వం



అభివాదం చేస్తున్న మంచాల వెంకటస్వామి, యాదయ్యగౌడ్, సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు

కవాడిగూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతిని కొనసాగిస్తోందని ఐఏఎస్ విశ్రాంత అధికారి చిరంజీవులు అన్నారు. గ్రామాలకు పట్టుకొమ్మలైన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు అధికారాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్, కార్పొరేటర్ల యునైటెడ్ ఫోరమ్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన వాటికి వెంటనే బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యునైటెడ్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు మంచాల వెంకటస్వామి మాట్లాడుతూ బిల్లులు చెల్లించకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. యునైటెడ్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజన్నయాదవ్, మాజీ సర్పంచుల ఫోరం మహిళా అధ్యక్షురాలు అంబటి తులసి, నాయకులు భూపతి, సింగయ్యగౌడ్, లలిత, శ్రీహరి, తెలంగాణ ఉద్యమకారుల నేతలు సుల్తాన్ యాదగిరి, ప్రఫూల్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచ్‌ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బిల్లులు అడిగితే అరెస్టులు చేస్తున్నారని వాపోయారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న రూ. 600 కోట్ల బిల్లులు చెలించాలని, బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్న సర్పంచ్‌ల కుటుంబాలకు కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని యాదయ్యగౌడ్ హెచ్చరించారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

కవాడిగూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లో పలు బస్తీల్లో నాయకుడు కల్యగోపి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, మధు, విఠల్ కార్తీక్‌యాదవ్, వెంకటేష్, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పి. శ్రీధర్‌చారి కోరారు. గురువారం సభ వాల్‌పోస్టర్, స్టికర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నాయకులు, తెలంగాణవాదులు సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. బీఆర్ఎస్ ప్రచార కమిటీ అధ్యక్షుడు శేరేష్, పార్టీ నాయకులు కృపాకర్, విజయ, స్వరూప, మేఘమాల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌చారి, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాట్లు



అంబర్‌పేట: వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం అంబర్‌పేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు సభకు వెళ్లడానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.

గోల్నాకలో జెండా దిమ్మెల ఏర్పాటు

గోల్నాక: బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా గోల్నాకలో ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27న పార్టీ జెండాలను ఆవిష్కరించి సంబరాలు జరుపుకోవడానికి జెండా దిమ్మెలను ఏర్పాటు చేసి గులాబీ రంగులు వేస్తున్నారు. పనులను పార్టీ సీనియర్ నాయకుడు ఎ. సురేష్‌గౌడ్ పర్యవేక్షిస్తున్నాడు.



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన గుజ్జ కృష్ణ, రామలింగం తదితరులు

నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథి ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ కళామండలి జాతీయ అధ్యక్షుడు జె.రామలింగం విజ్ఞప్తి చేశారు. గురువారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావును కలిసి నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలని కోరారు. దాదాపు 500 మంది కళాకారులు నేడు పేదరికంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కళాకారులకు న్యాయం చేస్తామని ప్రొఫెసర్ కోదండరాం, వీహెచ్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు ఉదయ్‌నేత, నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు దరువు అంజన్న, ప్రవీణ్, డప్పు స్వామి, సలీం, వేణు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాలి

కవాడిగూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్ పిలుపునిచ్చారు, ఉపాధి హామీ, ఆహార భద్రత పథకం, వ్యవసాయ రంగాలకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు తీసుకువస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరలు పెరుగుతున్నా కూలీల రేట్లు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేయాలనే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మే 20వ తేదీన జరగనున్న జాతీయ సమ్మెను గ్రామీణ బంద్‌గా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక ప్రజా సంఘాల నేతలు నాగయ్య, కాంతయ్య, అంజయ్య, గంగన్న, వెంకట్ రాములు, శాంతయ్య, ప్రసాద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

నల్లకుంట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రవణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద గురువారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. హరినాథ్‌రెడ్డి, నాయకులు రామ్మోహన్‌రావు, దేవిరెడ్డి విజితారెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జితేందర్‌రెడ్డికి సన్మానం



జితేందర్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు ఎన్. అజయ్‌కుమార్, ఎస్. హరినాథ్‌రెడ్డి తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారుడిగా నియమితులైన ఏపీ.జితేందర్‌రెడ్డిని టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి గురువారం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్మోహన్‌రావు,చ బొమ్మిడి శ్రవణ్, దేవిరెడ్డి విజితారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

